

రక్షిత నీటి పథకాల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

మండల పరిధిలోని పలు భారీ రక్షిత మంచినీటి పథకాలను జెడ్‌పి సిఇఒ కెఎస్‌ఎస్.సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు, రుస్తుంబాదలోని మంచినీటి చెరువులను పరిశీలించారు. రాపిడ్ శాండ్ ఫిల్టర్‌బెడ్లతోపాటు మైక్రోఫిల్టర్ బెడ్ల పని తీరును పరిశీలించారు. పథకాల ద్వారా తాగునీటి సరఫరా, రక్షిత మంచినీటి చెరువుల సామర్థ్యం తదితర అంశాలపై ఆరా తీశారు. పథకాల పనితీరును ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ టి.లోకేశ్ ఆయనకు వివరించారు. పథకాలు ఇంకా మెరుగైన పద్ధతిలో నిర్వహించేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి జెడ్‌పికి పంపాలని ఎఇకి సూచించారు. ఆయన వెంట ఎంపిడిఒ రామకృష్ణంరాజు, ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్, కాంట్రాక్టర్ లోకం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



కేంద్రం పద్దు పలికేనా..!

- పోలవరం పునరావాసానికి నిధులిచ్చేనా
- కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు మోక్షం లభించేనా
- మద్దతు ధరల గ్యారెంటీ చట్టం మాటేమిటో
- ఆదాయపు పన్ను పరిమితిపై వేతన జీవుల ఎదురుచూపు
- నేడు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల కన్నీటి వ్యథలు.. వేతన జీవుల ఆదాయపు పన్ను కష్టాలు, కర్షకుల కన్నీటి వేదనను కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తుందా.. కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లకు సంబంధించి శనివారం ప్రవేశ పెట్టబోయే కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగేనా అంటూ జిల్లా ప్రజానీకంలో విస్తృత చర్చ సాగుతోంది. కేంద్రంలో మోదీ సర్కార్ నిలబడేందుకు ఆక్సిజన్‌గా రాష్ట్రంలోని టిడిపి ఎంపీలు ఉన్నారు. జిల్లాకు చెందిన బిజెపి ఎంపీ కేంద్రమంత్రిగా సైతం ఉన్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని కేంద్ర ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయింపు, ఇక్కడి ప్రజలకు ఊరట కలిగించే అంశాలు ఉంటాయని అంతా గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. మోదీ సర్కార్ ఏం చేస్తుందో శనివారం తేలిపోనుంది.

కేంద్ర ప్రభుత్వం శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న 2025-26 బడ్జెట్‌లో జిల్లాలోని కేంద్ర పరిధిలోని ప్రాజెక్టులు, వ్యవసాయ, ఆక్వా రంగాలకు సంబంధించి కేటాయింపులపైనే ఇప్పుడు ప్రజానీకంలో గంపెడాశలు ఉన్నాయి. ముఖ్యమైంది పోలవరం నిర్వాసితుల సమస్య. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 20 వేలకుపైగా నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. కేంద్రంలో ఎన్‌డిఎ మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పోలవరానికి దాదాపు రూ.12 వేల కోట్లు కేటాయింపులున్నట్లు కేంద్రం ప్రకటించింది. అందులో నిర్వాసితులకు కేవలం పునరావాస ప్యాకేజీ కింద రూ.రెండు వేల కోట్లు మాత్రమే కేటాయించింది. ఇంకా ఇంటి వాల్యూయేషన్, భూములకు సంబంధించిన సొమ్ము, కాలనీల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. ఉమ్మడి, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పోలవరం నిర్వాసితులకు పరిహారం కింద రూ.30 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసి కేంద్రానికి పంపించింది. ఇటీవల నిర్వాసితులకు జమ చేసిన సొమ్ము కేవలం రూ.రెండు వేల కోట్లు మాత్రమే ఉంది. ఏలూరు జిల్లాలో దాదాపు రూ.250 కోట్లు వరకూ మాత్రమే వచ్చిన పరిస్థితి. 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు మాత్రమే ముందుగా సొమ్ముచెల్లిస్తామని చెబుతున్నారు. 2022లో వచ్చిన వరదలతో కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా గ్రామాలన్నీ ముంపునకు గురయ్యాయి. దీంతో నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. ఈ బడ్జెట్‌లో పోలవరం నిర్వాసితులకు నిధులు కేటాయిస్తారో, లేదో వేచిచూడాలి.

రైల్వేలైన్లకు మోక్షం కలిగేనా?


ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రధానమైన రైల్వే ప్రాజెక్టులు రెండు ఉన్నాయి. కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్ అనేది దశాబ్దాల కలగానే ఉంది. కొవ్వూరు నుంచి భద్రాచలం వరకూ 151 కిలోమీటర్ల మేర ఈ రైల్వేలైన్ ప్రతిపాదన జరిగింది. 2013లో పూర్తిస్థాయిలో తెరపైకి వచ్చింది. దీనిపై సర్వే చేసి రూ.2,200 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు సైతం రూపొందించారు. అప్పటి నుంచి రూ.కోటి, రెండు కోట్లు నిధులు కేటాయించడం తప్ప రైల్వేలైన్ ముందుకు సాగేలా నిధుల కేటాయింపు లేకుండాపోయింది. ఈ రైల్వేలైన్ నిర్మాణం జరిగితే ఏజెన్సీ, మెట్ట ప్రాంతానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఏజెన్సీ ప్రాంతంలో పండే ఉత్పత్తులు చేరవేత మార్గం సుగమంగా ఉంటుంది. ఇటీవల కాలంలో ఈప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్రంలోని మంత్రులు చెప్పారు. బడ్జెట్‌లో నిధులు కేటాయింపు ఉంటుందో, లేదో చూడాలి. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ పనులకు కొద్దిమేర నిధులు కేటాయించడం తప్ప వేగంగా పనులు ముందుకు సాగిన పరిస్థితి లేదు. ఈ బడ్జెట్‌లోనైనా పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తారా అనే చర్చ సాగుతోంది. అదేవిధంగా కేంద్ర విద్యాసంస్థ తాడేపల్లిగూడెంలోని నిట్ పనులు ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదు. నిధుల కేటాయింపు పెద్దఎత్తున సాగితే పనులు త్వరితగతిన ముందుకు సాగే అవకాశం ఉంది.

మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేసేనా?

జిల్లాలో 80 శాతానికిపైగా ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. వరి, మొక్కజొన్న, పామాయిల్, మామిడి, పత్తి వంటి అనేక పంటలను రైతులు పండిస్తున్నారు. పండించిన పంటలకు సరైన ధర దక్కక రైతులు వ్యవసాయం నుంచి తప్పుకుంటున్న పరిస్థితి ఉంది. పండించిన పంటలకు వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని రైతులు కోరుతున్నారు. ఏళ్ల తరబడి ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు పోరాటం చేస్తున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం వస్తుందేమో చూడాలి. ఆక్వా సరైన ధర లేక, మేత ధరలు పెరిగిపోయి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఆక్వారైతులకు ఊరట కలిగించే అంశాలు బడ్జెట్‌లో ఉంటాయని ఆక్వా రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆదాయపు పన్ను పరిమితిపై వేతన జీవులకు ఊరట కలిగేనా?

ఉద్యోగులకు ఆదాయపు పన్ను పరిమితి రూ.2.50 లక్షల నుంచి రూ.ఐదులక్షలకుపైగా పెంచాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈ శ్లాబ్ నిర్ణయించి దశాబ్దాలు గడిచిపోయింది. ఈ కాలంలో ధరల పెరుగుదల నుంచి ఎన్నో మార్పులు జరిగినా ఆదాయ పన్నులో మాత్రం మార్పులు లేకుండాపోయాయి. ఈ బడ్జెట్‌లోనైనా తమ కోరిక నెరవేరుతుందా అని వేతన జీవులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

రానున్న కాలంలో బిసిలకు పెద్దపీట

పెనుగొండలో సిఎం చంద్రబాబు

వాసవీ మాత ఆలయంలో పూజలు, పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పెనుగొండ, ఆచంట

రానున్న కాలంలో బిసిలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయనుందని సిఎం చంద్రబాబు తెలిపారు. బిసిలను రాజకీయంగా పైకి తీసుకొచ్చిన ఘనత టిడిపిదేనన్నారు. శుక్రవారం పెనుగొండలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయానికి విచ్చేసిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. గురుపీఠం నిర్మాణానికి సిఎం శంకుస్థాపన చేశారు. చంద్రబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆర్య వైశ్యులు నీతి, నిజాయితీలతో వ్యాపారం చేస్తారని, ఆదాయంలో కొంత ప్రజాసేవకు వినియోగిస్తారని ప్రశంసించారు. అనంతరం మార్కెట్ యార్డు ఆవరణలో బిసిలైన శెట్టిబలిజ, గౌడ, ఇతర ఉపకులాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తొలుత వినతిపత్రాలు స్వీకరించారు. బిసిలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత టిడిపిదేనన్నారు. గీత కులాల వారికి మద్యం షాపుల్లో పది శాతం కేటాయించామని, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం సబ్సిడీ అందించామన్నారు.

ఎయిడెడ్ కాలేజీ సిబ్బంది జీతం స్కేల్‌పై చంద్రబాబుకు వినతి

ఎస్‌వికెపి కాలేజీలో ఎయిడెడ్ పోస్టులు భర్తీ చేయాలని, అన్‌ఎయిడెడ్ కాలేజీలో పని చేస్తున్న సిబ్బందికి జీతం స్కేల్ వర్తింపజేయాలని ఎస్‌వికెపి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కెవి.సూర్యనారాయణ, కళాశాల సిబ్బంది చంద్రబాబుకు వినతిపత్రం అందించారు. జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందించాలని, ప్రతిభ పురస్కారాలకు ఎంపిక చేయాలని కోరారు.

సిఎం పర్యటన సాగిందిలా..

ముఖ్యమంత్రి చంద్రబాబు పెనుగొండ ఎఎంసిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు ఉదయం 11:53 గంటలకు చేరుకున్నారు. అనంతరం అక్కడ నుంచి రోడ్డు మార్గాన ప్రజలకు అభివాదం చేస్తూ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం 1:55 గంటలకు తిరిగి ఎఎంసి కార్యాలయానికి చేరుకున్నారు. హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్లారు. కూటమి నేతలను ఆయన దగ్గరికి అనుమతించకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, టిజి.భరత్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్‌ఎలు పితాని సత్యనారాయణ, పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, ఆరిమిల్లి రాధాకృష్ణ, రామరాజగోపాల్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎపి ఎస్‌సిపిసి ఛైర్‌పర్సన్ పీతల సుజాత, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మాజీ ఎంఎల్‌ఎలు బండారు మాధవనాయుడు, ముళ్లపూడి వెంకటకృష్ణారావు, సర్పంచి నక్కా శ్యామల సోనీ, దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు, ఆర్యవైశ్య నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎఎంసిలోనే కలెక్టరేట్ ఏర్పాటు చేయాలి

గత ప్రభుత్వ జిఒను కొనసాగించాలి

పట్టణానికి దూరంగా కలెక్టరేట్ ఏర్పాటు తగదు

కలెక్టరేట్ మార్పు ప్రచారంపై కలెక్టర్, ఎంఎల్‌ఎ స్పందించకపోవడం బాధాకరం

కలెక్టరేట్ మార్పుపై ఆందోళనకు సిద్ధం

సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతల పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం మార్కెట్ యార్డులోనే జిల్లా కలెక్టరేట్‌ను శాశ్వతంగా ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వం విడుదల చేసిన జిఒను కొనసాగించాలని సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. కలెక్టరేట్ స్థలం మార్పుపై జిల్లా అంతటా అనేక ప్రచారాలు జరుగుతున్నా కనీసం ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్, ఎంఎల్‌ఎ స్పందించకపోవడం సిగ్గుచేటని ఘాటుగా విమర్శించింది. భీమవరం పట్టణానికి దూరంగా కలెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేసింది.. కలెక్టరేట్ మార్పుపై రానున్న రోజుల్లో ఆందోళనకు సిద్ధం కావాలని సమావేశం పిలుపునిచ్చింది. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ స్థలం మార్పుపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించారు. రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. అయితే కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన అయిన టిడిపి, జనసేన సమావేశానికి దూరంగా ఉన్నాయి. మిగిలిన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు, మేధావులు అభివాదం తెలియజేసి తమ అభిప్రాయాలను తెలిపారు. రానున్న రోజుల్లో అఖిలపక్షంగా ఏర్పడి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి కలెక్టరేట్ స్థల మార్పునకు వ్యతిరేకంగా, మార్కెట్ యార్డులో శాశ్వత కలెక్టరేట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సమావేశంలో ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా నాయకులు లంకా కృష్ణమూర్తి, ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి కొల్లాబత్తుల మహంకాళి, కాంగ్రెస్ నాయకులు కాకర రాజశేఖర్, కొర్ర శ్రీనివాసయాదవ్, సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, దళిత ఐక్యవేదిక నేత గంటా సుందర్‌కుమార్, ప్రజాసంఘాల నేతలు జక్కంశెట్టి సత్యనారాయణ, బేతు కృష్ణారావు, జి.రాజకుమార్, చిన్ని బాబూరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వర్లు, బళ్ల చినవీరభద్రం పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

అందుబాటులో ఉండేలా కలెక్టరేట్ ఏర్పాటు చేయాలి

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి



పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం జిల్లాను రెండు జిల్లాలుగా ఏర్పాటు చేసి తాత్కాలికంగా కలెక్టరేట్‌ను ప్రకృతి ఆశ్రమం వద్ద ఏర్పాటు చేసింది. అప్పటి పరిస్థితుల రీత్యా ప్రజలకు ఇబ్బందైనా తాత్కాలికం కాబట్టి ఎవరూ దాన్ని వ్యతిరేకించలేదు. కలెక్టరేట్‌ను శాశ్వతంగా నిర్మించేందుకు అందరికీ అందుబాటులో ఉండేలా మార్కెట్ యార్డులో ఏర్పాటుకు గత ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. దాన్ని ప్రజలంతా స్వాగతించారు. అయితే ఇప్పుడు ఆ జిఒ రద్దయినట్లు, ఎక్కడో భీమవరం పట్టణానికి దూరంగా ప్రజలకు అందుబాటులో లేనిచోటకు మారుస్తున్నట్లు సాగుతున్న ప్రచారం ఆందోళన కల్గిస్తోంది. దీనిపై కలెక్టర్, ఎంఎల్‌ఎ కనీసం స్పందించలేదు. దీనిపై వెంటనే వారు స్పందించాలి. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా కలెక్టరేట్‌ను మార్కెట్‌యార్డులో శాశ్వతంగా నిర్మించాలి. లేకుంటే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యావంతులను ఏకం చేసి ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతాం.

రాజకీయ జోక్యం కన్పిస్తోంది

కామన నాగేశ్వరరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు



కలెక్టరేట్ స్థల మార్పులో రాజకీయ జోక్యం కన్పిస్తోంది. కలెక్టరేట్ అంటే విశాల భవనాలు, దానికితోడు జిల్లా ప్రజానీకానికి అందుబాటులో ఉండాలి. మార్కెట్ యార్డులోనే కలెక్టరేట్ శాశ్వతంగా ఏర్పాటు చేయాలి. అంతేగాని ప్రభుత్వం మారినప్పుడల్లా వారి స్వప్రయోజనాల కోసం కలెక్టరేట్‌ని మారుస్తారా. ఈ విషయం స్థానిక ఎంఎల్‌ఎకు తెలిసి జరుగుతుందా, తెలియకుండా జరుగుతుందా. మార్కెట్ యార్డులో శాశ్వత ప్రాతిపదికన కలెక్టరేట్ నిర్మించాలి. లేనిపక్షంలో అఖిలపక్ష పోరాటంలో మేము కూడా భాగస్వాములవుతాం.

ఎక్కడో నిర్మిస్తామంటే ఊరుకోం

కోనాల భీమారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి



రహస్యంగా ఎవరికీ చెప్పకుండా ఎక్కడో స్థలం కేటాయించి ఎందుకు మార్చాలనుకుంటున్నారో వెంటనే చెప్పాలి. జరుగుతున్న ప్రచారంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉంది. భీమవరం పట్టణంలో కాకుండా ఎక్కడో కలెక్టరేట్ నిర్మిస్తాం అంటే ఊరుకోం. ఐక్య కార్యాచరణలో సిపిఐ భాగస్వామ్యం ఉంటుంది.

స్వప్రయోజనాల కోసం మార్పు సరికాదు

పాతపాటి హరికుమార్‌రాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు



ప్రజాస్వామ్యంలో ప్రజలందరి అవసరాలు తీర్చాలి. ప్రజల మేలుకోరాలి. అంతేగాని అధికారంలోకి రాకముందు ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల పక్షాన లేకుండా సొంత ప్రయోజనాల కోసం పని చేసుకోవడం దారుణం. భీమవరం పట్టణానికి దూరంగా కలెక్టరేట్ మార్చే ఆలోచనను మేము వ్యతిరేకిస్తున్నాం. రౌండ్‌టేబుల్ సమావేశ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. ఐక్యకార్యాచరణలో పాల్గొంటాం.

ఇది ఒక పిచ్చి తుగ్లక్ పని

దిగుపాటి రాజగోపాల్, మాజీ ఎంఎల్‌ఎ



పరిపాలన సవ్యంగా సాగుతున్న సమయంలో కలెక్టరేట్ స్థలం మార్పు చేయాలనుకోవడం ఒక పిచ్చి తుగ్లక్ పని. మార్కెట్ యార్డులో కలెక్టరేట్ ఏర్పాటు చేయడం అనేది అన్ని విధాలా మంచిది. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు అనుకూలమైనది. ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండే ప్రాంతం. ఈ విషయాలు ఆలోచించకుండా కొంతమంది స్వప్రయోజనాల కోసం కలెక్టరేట్‌కు ఎక్కడికో తీసుకెళ్లాలనుకోవడం దుర్మార్గం.

ప్రభుత్వం మారినా అదే నిర్బంధం..!

- సిఎం జిల్లా పర్యటన నేపథ్యంలో సిపిఎం నేతలకు నోటీసులు
- తెల్లవార్లు ఫోన్‌కాల్స్‌తో నేతలను విసిగించిన పోలీసులు

ప్రజాశక్తి - భీమవరం



పోలీసుల నుంచి నోటీసులు అందుకుంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

గత వైసిపి ప్రభుత్వం ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి మూల్యం చెల్లించుకుంది. మాట్లాడితే కేసులు, ఆందోళన చేస్తే అరెస్టులు ఇలా భయభ్రాంతులకు గురిచేస్తూ పాలన సాగించింది. అయితే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ తీరు మాత్రం వైసిపి ప్రభుత్వాన్ని తలదన్నేలా ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం పెనుగొండలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించారు. నిత్యం ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగించే సిపిఎం నేతలకు పోలీసులు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్‌కు ఆయన స్వగృహం వద్ద గురువారం అర్ధరాత్రి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్యను గృహనిర్బంధం చేసి నోటీసులు జారీ చేశారు. జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణకు పార్టీ జిల్లా కార్యాలయం వద్దే నోటీసులు జారీ చేసి సిఎం పర్యటనకు వెళ్లొద్దంటూ హుకుం జారీ చేశారు. సిఎం కాన్వాయ్‌ను హెలీపాడ్ వద్దగాని, వేదిక వద్దకు వచ్చే దారిలోగాని, వేదిక వద్దగాని ఆటంకపరుస్తారని మాకు ముందస్తు సమాచారం ఉందని, ఈ కార్యక్రమానికి ప్రభుత్వం మీకు అనుమతి ఇవ్వలేదని పోలీసులు నోటీసుల్లో పొందుపరిచారు. అయితే చంద్రబాబు జిల్లా పర్యటన నేపథ్యంలో సిపిఎం ఎటువంటి కార్యక్రమాలకూ పిలుపునివ్వలేదు. అయితే పోలీసులకు మాత్రం సమాచారం ఉందంటూ నోటీసులు జారీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరికొంతమంది నేతలకు తెల్లవార్లు పోలీసులు ఫోన్లు చేసి అనేక ఇబ్బందులకు గురి చేశారు. మీరు ఎక్కడున్నారు అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా నియంతృత్వ పోకడతో వ్యవహరించడం దారుణమన్నారు. అర్ధరాత్రి నోటీసులు జారీ చేయడం సరైంది కాదని విమర్శించారు. గత ప్రభుత్వ విధానాలు మార్చుకోకపోతే వారికి పట్టిన గతే కూటమికి తప్పదని హెచ్చరించారు.

ఎస్ఐ ఆత్మహత్యతో కలకలం..!

కారణాలపై పలు ఊహాగానాలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్ఐ ఆత్మహత్యకు పాల్పడటం పశ్చిమగోదావరి జిల్లాలో తీవ్ర కలకలం సృష్టించింది. పోలీసు అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి గురవ్వగా తణుకు పరిసర ప్రాంతాల్లో కలకలం రేపింది. వివరాల్లోకెళ్తే తణుకు రూరల్ ఎస్ఐగా ఎజిఎస్.మూర్తి (38) పని చేస్తున్న సమయంలో గేదెల అపహరణ కేసులో ఆరోపణలు వచ్చాయి. దీంతో గతేడాది నవంబర్‌లో ఉన్నతాధికారులు విచారణ జరిపి ఎస్ఐను విఆర్‌కు పంపారు. శుక్రవారం పెనుగొండలో సిఎం బందోబస్తు విధులకు హాజరయ్యేందుకు భీమవరంలో రివాల్వర్ తీసుకుని గురువారం రాత్రి తణుకు సమీపంలోని పైడిపర్రులో ఉన్న ఇంటికొచ్చారు. శుక్రవారం ఉదయం తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్ఐ మూర్తి వాష్‌రూమ్‌కు వెళ్లొస్తా అని చెప్పి వెళ్లారు. తనతో తెచ్చుకున్న సర్వీస్ రివాల్వర్‌తో పాయింట్ బ్లాంక్‌లో షూట్ చేసుకున్నారు. పెద్ద శబ్దం రావడంతో స్టేషన్లోని పోలీస్ సిబ్బంది అక్కడికెళ్లగా ఎస్ఐ రక్తపుమడుగులో పడి ఉన్నారు. సిబ్బంది హుటాహుటీన ఎస్ఐ మూర్తిని 108 వాహనంలో తణుకు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరానికి చెందిన ఎజిఎస్.మూర్తి 2012 బ్యాచ్‌లో ఎస్ఐగా విధుల్లో చేరి కృష్ణా జిల్లాలో మొదట పోస్టింగ్ తీసుకున్నారు. అనంతరం భీమవరం ట్రాఫిక్, పెరవలి, ఆచంట, తణుకు రూరల్ పోలీస్ స్టేషన్లలో పని చేశారు. ఆయనకు భార్య విజయ, కుమారుడు చందన్, కుమార్తె దీక్షిత ఉన్నారు. నెల రోజుల క్రితం కుమార్తె మొదటి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. చందన్ యుకెజి చదువుతున్నాడు. మూర్తి తండ్రి సత్యనారాయణ కె.గంగవరంలో వ్యవసాయం చేస్తుంటారు. తణుకు ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీ వద్దకు వచ్చిన మూర్తి అన్నయ్య, చెల్లెలు, బావ, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

విఆర్‌కు వెళ్లడానికి కారణాలు!

పని చేసిన అన్ని స్టేషన్లో మంచి పేరు తెచ్చుకున్న మూర్తి కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేసే వారని సమాచారం. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన ఆకుల మారుతి అయ్యన్నరావు వేల్పూరులో ఒక షెడ్డు అద్దెకు తీసుకుని గేదెల ఫారం నిర్వహిస్తున్నాడు. అయ్యన్నరావుకు చెందిన రెండు గేదెలు చోరీ కావడంతో నిందితునిగా భావించిన వీరభద్రపురానికి చెందిన బండి ఈశ్వరరావు నుంచి రికవరీ పేరుతో రూ.13 లక్షలు వసూలు చేసిన పోలీసులు బాధితుడికి మాత్రం కేవలం రూ.5 లక్షలు మాత్రమే అందజేసినట్లు సమాచారం. నగదు చేతులు మారుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం, బాధితునికి రికవరీ చేసిన నగదు పూర్తిగా ఇవ్వకపోవడంపై ఆరోపిస్తూ బాధితుడు మారుతీ అయ్యన్నరావు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేయడంతో తాడేపల్లిగూడెం డిఎస్‌పి విశ్వనాథ్ గతేడాది నవంబర్ 18న విచారణ జరిపి తణుకు రూరల్ ఎస్ఐగా ఉన్న ఎజిఎస్.మూర్తి, ఎఎస్ఐ అంజిబాబులను విఆర్‌కు పంపించారు. అయితే ఎస్ఐ మూర్తి రాత్రంతా కుటుంబ సభ్యులతో గడిపినట్లు, ఏదో విషయమై మదన పడుతున్నట్లు కన్పించారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. శాఖాపరంగా ఉన్నతాధికారులు లేక రాజకీయపరంగా ఏమైనా ఒత్తిడి ఎదుర్కొంటున్నారా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో వైరలైన వీడియోలో ఎస్ఐ కన్పించకపోయినా ఎస్ఐను కార్నర్ చేశారని, విఆర్‌కు వెళ్లాల్సి వచ్చిందని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారా అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఏదేమైనా ఆత్మహత్యకు కారణాలేమిటనేది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది.



తణుకు ఆస్పత్రి వద్ద రోదిస్తున్న ఎస్ఐ బంధువులు (ఇన్‌సెట్లో ఎస్ఐ మూర్తి)

డిఎస్‌పితో విచారణ: ఎస్‌పి

విఆర్‌లో ఉన్న ఎస్ఐ మూర్తి మృతికి కారణాలపై డిఎస్‌పి స్థాయి అధికారులతో పూర్తిస్థాయి విచారణ జరుపుతామని జిల్లా ఎస్పీ ఆద్నాన్ నయీం అస్మి తెలిపారు. సంఘటన జరిగిన తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆపై తణుకు ఆసుపత్రిలో మార్చురీలో భద్రపరిచిన మూర్తి మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులు తగిన న్యాయం చేస్తామని, అండగా ఉంటామని తెలిపారు.

రక్తదాతలు ప్రాణదాతలు

నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రక్తదానం చేసే ప్రతి ఒక్కరూ ప్రాణదాతతో సమానమని నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్ రెడ్డి అన్నారు. నిట్‌లోని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్, ప్రయత్నం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రక్తపు బొట్టూ ఆయువు పట్టు వంటిదని తెలిపారు. సరైన సమయానికి రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితిలో రక్తం అవసరమైన వారికి విద్యార్థులు రక్తదానం చేసి నిండు ప్రాణాలను కాపాడడంతో పాటు వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని సూచించారు. రక్తం దానం చేస్తే నీరసించిపోతారనే అపోహ కొంత మందిలో ఉందని, ఆరోగ్యంగా ఉన్నవారు ఎన్నిసార్లయినా రక్తదానం చేయొచ్చని తెలిపారు. ముందుగా రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి, డీన్ అకడమిక్ ఎన్.జయరామ్, ఆచార్యులు రాముడు రక్త దానం చేసి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఏలూరు జనరల్ ఆసుపత్రి వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో గూడెం ప్రభుత్వాసుపత్రికి చెందిన సిబ్బంది మొత్తం 244 మంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన విద్యార్థులందరికీ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సౌజన్యంతో సమకూర్చిన లంచ్ బాక్స్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ క్లస్టర్ హెడ్ బి.రూపేష్ కుమార్, మేనేజర్ బాలకృష్ణ, డీన్‌లు వి.సందీప్, కె.హిమబిందు, జిబి.వీరేష్‌కుమార్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ పోరాటం

ప్రజాశక్తి - భీమవరం

లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని సిఐటియు భీమవరం రూరల్ మండలం నాయకులు ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో హేమలత అధ్యక్షతన మండల సిఐటియు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను తుంగలోతొక్కి అడ్డగోలుగా లేబర్ కోడ్లను తీసుకొచ్చి ఉద్యోగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. కేంద్రంలో బిజెపి పాలకులు అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినప్పటికీ ప్రజలకు చేసిందేమీ లేకపోయినా ఉన్న చట్టాలను తీసేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. తక్షణం లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా నిరసనలో భాగంగా భీమవరంలో కూడా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నేతలు సురేష్, దీపిక, మారెమ్మ పాల్గొన్నారు.

ఈస్ట్ కుక్కిలేరును ఆధునికీకరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని వేములదీవి వెస్ట్ పంచాయతీలోని మోడిపర్ర నుంచి వేములదీవి తూర్పు వరకూ ఉన్న ఈస్ట్ కుక్కిలేరును తక్షణం ఆధునికీకరించాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, వేములదీవి నీటి సంఘం అధ్యక్షులు అడ్డాల శ్రీనివాసు అధికారులకు విజ్ఞప్తి చేశారు. డ్రెయినేజీ శాఖ మండల ఎఇ పావనితో సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఈ మురుగు కాలువను తవ్వలేదన్నారు. ప్రస్తుతం పలుచోట్ల ఆక్రమణలకు గురై పూడుకుపోయిందని, దీంతో తీర ప్రాంతంలో ఉన్న వేలాది ఎకరాలు సాగుకు పనికిరాక రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గొందిమూల శివారు మోడిపర్ర నుండి వేములదీవి తూర్పు పంచాయతీ వరకూ పూర్తి స్థాయిలో ఆధునికీకరించాలని, కాలువపై ఒకచోట కల్వర్టు, రెండు చోట్ల వంతెనలు నిర్మించేలా ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎఇ పావని మాట్లాడుతూ ఈస్ట్ కుక్కిలేరు మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణకు రూ.46 లక్షలు అంచనాలు పంపామని, మైనర్ డ్రెయిన్‌కు నిధులు కేటాయించాలని పంపామని, ప్రస్తుత పరిస్థితుల్లో కల్వర్టుల నిమిత్తం, పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు నిధులు పెంచి ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తిరుమాని నాగరాజు, బొక్కా వెంకటేశ్వరరావు, తుమ్మా సూర్యారావు, కవురు శ్రీనివాస్, కవురు శ్రీరాములు, బొక్కా సత్యనారాయణ, కవురు సత్యనారాయణ, బొక్కా హనుమంతరావు, కవురు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పన్నుల వసూలుపై దృష్టి సారించాలి : కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

ఇంటి, తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లపై మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. పట్టణ పర్యటనలో భాగంగా పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ఆస్తి పన్ను వసూలు, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ఏ అభివృద్ధి పని చేపట్టాలన్నా పన్నుల వసూలు కీలకమన్నారు. నూరు శాతం పన్నుల వసూలుకు సచివాలయాల్లోని వార్డు కార్యదర్శులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అండర్, అన్ అసెస్మెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వార్డుల్లో, డ్రెయినుల్లో మురుగుపారుదల లేదని, వెంటనే శుభ్రం చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు, శానిటరీ మేస్త్రి కిషోర్ నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లు రద్దు చేయాలని సిఐటియు మండల కమిటీ డిమాండ్ చేసింది. సిఐటియు సమావేశం సత్యవతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పి.నాగరత్నం మాట్లాడుతూ సిఐటియు అఖిల భారత కమిటీ పిలుపుమేరకు ఐదో తేదీన ప్రదర్శన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మాట్లాడుతూ పాలకుల విధానాలు ప్రజలను, కార్మికులను, ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై సమాధానాలు చెప్పడానికి పాలకులు సిద్ధంగా లేరని, అందుకనే ప్రజలకు సంబంధం లేని విషయాలను ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారని అన్నారు. ఒక పక్కన పెట్టుబడులు వచ్చేస్తున్నాయని ప్రచారం చేస్తూనే మరోపక్క అప్పులతో కాలం గడుపుతున్నామని చెబుతున్నారని తెలిపారు. కేంద్రం తీసుకొస్తున్న లేబర్ కోడ్‌ల వల్ల ఉద్యోగ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. తక్షణం వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నిర్మల, లక్ష్మి, మద్దాల శ్రీనివాస్, కొత్తల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

36వ జాతీయ రహదారి భద్రతా మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాయక్ మాట్లాడుతూ రహదారులపై అనుసరించాల్సిన నియమాలు, హెల్మెట్, సీటు బెల్ట్ ఉపయోగం, వేగ పరిమితులు పాటించడం వంటి అంశాలపై విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ యువత రహదారులపై బాధ్యతాయుతంగా ప్రవర్తించడం సమాజ భద్రతకు కీలకమన్నారు. ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ మాట్లాడుతూ రహదారి భద్రతపై బాధ్యత గల పౌరులుగా మారాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కృష్ణ, జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్చి 8న లోక్ అదాలత్

నరసాపురం: మార్చి 8వ తేదీన నరసాపురం అన్ని కోర్టు సముదాయాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నరసాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్టుల్లో ఉన్న రాజీపడదగిన క్రిమినల్, కుటుంబ తగాదాలు, సివిల్ భూ తగాదాలు, చెక్ బౌన్స్ తదితర కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వారి న్యాయవాదుల ద్వారా గానీ, సంబంధిత పోలీసు వారిని లేదా, న్యాయ సేవాధికార సంస్థను గానీ సంప్రదించవచ్చని తెలిపారు. ఆయా బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన కేసులు కూడా ప్రి లిటిగేషన్ కేసుల కింద సెటిల్ చేసుకోవచ్చన్నారు.

కృష్ణారెడ్డికి సత్కారం

పెనుమంట్ర: క్రీడా ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసి, ఎందరో బాస్కెట్ బాల్, కబడ్డీ తదితర క్రీడాకారులను కృష్ణారెడ్డి తయారు చేశారని మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సిహెచ్.చిన సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో సుదీర్ఘకాలం పీడీగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన కర్రి కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు కృష్ణారెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పరిసర ప్రాంతాల్లోని క్రీడా ఉపాధ్యాయులు, మార్టేరులోని ఖండవల్లి కిషోర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - గణపవరం

డిగ్రీ కాలేజీలో 2023-24 గాను ప్రతిభ కనబర్చిన ఎలగం హారిక (బిఎస్‌సి ఎంపిసిఎస్)కు రూ.40 వేలు, అలేఖ్యకు (బిఎస్‌సి బిజడ్‌సి) రూ.20 వేలు, ఎర్రంశెట్టి కృష్ణకుమారి (బిఎస్‌షి ఎంపిసి) రూ.10,000 ప్రోత్సాహకాలను, మెమెంటోలను సరిపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ శ్రీరామ్ లక్ష్మణ్, కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అందజేశారు. ఈ సందర్భంగా రామ్ లక్ష్మణ్ మిత్రులు పలువురు మాట్లాడుతూ రామ్‌లక్ష్మణ్ అమెరికాలో ఉన్నప్పటికీ పుట్టి పెరిగిన ఊరు అభివృద్ధికి, విద్యాభివృద్ధికి ఉదారంగా నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ నిర్మలాకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు, చింతలపాటి రాజన్‌రాజు, చింతలపాటి కృష్ణంరాజు, నడపల్లి శ్రీరామ పాల్గొన్నారు.

జాబ్ మేళా వాయిదా

తాడేపల్లిగూడెం: మార్చి 8వ తేదీ వరకూ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీన వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో జరగాల్సిన జాబ్ మేళా వాయిదా వేసినట్లు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తిరిగి మార్చి 9వ తేదీన ఈ జాబు మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా ఉచిత వైద్య సేవలు

ఉండి: ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా ప్రతి ఒక్కరికీ సచివాలయం సమీపంలోనే ఉచిత వైద్య సేవలందించడం జరుగుతుందని పిహెచ్‌సి డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. శుక్రవారం ఉండి రెండో సచివాలయ పరిధిలో ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఫ్యామిలీ ఫిజిషియన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిచంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పిహెచ్‌సి వద్ద ఆరోగ్య సేవలు పొందడానికి రాలేని తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం వారి సచివాలయాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించి మెరుగైన సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దళితవాడల్లో సమస్యలు పరిష్కరించాలి

డిఆర్‌ఒకు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - భీమవరం

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులతో దళితవాడల్లో సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. దళితవాడల్లో సమస్యలపై సర్వే చేసిన అంశాలతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక కలెక్టలో శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లుకు జిల్లా నాయకత్వ బృందం అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా దళిత వాడల్లో సర్వే చేశామన్నారు. గణపవరం మండలం అర్ధవరంలో 500 కుటుంబాలున్న ఎస్‌సి పేటకు 26 సెంట్లు మాత్రమే శ్మశాన భూమి ఉందని, కనీసం మరొక అరెకరం భూమి సమకూర్చాలని కోరారు. ప్రతి గ్రామంలో పంచాయతీ అందించే తాగునీరు తాగేందుకు ఉపయోగపడటం లేదని, రూ.20 నుండి రూ.30 పెట్టి టిన్ను వాటరు కొనుక్కుంటున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు తగినన్ని చూపడం లేదని, చేసిన పనికి వేతనం కూడా వెంటనే ఇవ్వడం లేదని అన్నారు. కనీస వేతనం రూ.500 ఇచ్చి 150 రోజులు పనులు కల్పించాలని కోరారు. కొన్ని గ్రామాల్లో 104 వాహనం, రేషన్ వాహనం కొన్ని దళితవాడలకు రావడం లేదని తెలిపారు. ఇళ్ల స్థలాలు లేని వారున్నారని, ప్రభుత్వం మూడు సెంట్లు స్థలమిచ్చి ఐదు లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని కోరారు. నేటికీ డ్రెయినేజీలు, రోడ్లు కొన్ని ప్రాంతాల్లో లేవని, అంగన్వాడీ కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల పిల్లలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బృందంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, బల్ల చిన్న వీరభద్రరావు, సహాయ కార్యదర్శి ఎస్.అశ్రియ్య, జిల్లా కమిటీ సభ్యులు గుబ్బల నాగేశ్వరరావు, షేక్ బాదుషా, నరాలశెట్టి రామకృష్ణ, దొంగల నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఉపాధి కూలీలకు పనులు చూపాలని వినతి

ఉపాధి కూలీలకు పనులు చూపేలా దువ్వలోని వయ్యేరు కాలువ మట్టి తవ్వించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి కూలీకి వంద రోజులు పని కల్పించాల్సి ఉండగా అధికారులు పనుల్లేవని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామంలో మూడు కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్‌పై గట్లు శుభ్రం చేయడం, పూడిక తొలగించి గట్లు పటిష్టపర్చే పనుల కోసం ఉపాధి కూలీలను వినియోగించాలని కోరారు. ఇలా చేయడం వల్ల కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు వరదల సమయంలో పంట పొలాలు ముంపునకు గురికాకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి దొంగల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు బండారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న వ్యకాస నేతలు

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - కాళ్ల



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. శుక్రవారం ఏలూరుపాడు జెడ్‌పి హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన కట్టా వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణరాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథి గోపీమూర్తి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయుడు కట్టా వెంకటేశ్వరరావును అంతా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో భాగంగా ఏలూరుపాడు, బొండాడ, ఉండి పాఠశాలల్లో 33 ఏళ్లపాటు పనిచేసి విద్యార్థులు, గ్రామస్తుల మన్ననలు పొందారని ప్రశంసించారు. మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ కట్టా వెంకటేశ్వరరావు మాస్టర్ ప్రజా సేవకు అంకితమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరుపాడు సర్పంచి భూపతిరాజు జగ్గరాజు, ఎంఇఒలు ఎ.రవీంద్ర, వేంద్ర వెంకటేశ్వరరావు, ఎంపిటిసి రాంబాబు, జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, మాజీ ఎంపిపి మల్లికార్జునరావు, మాజీ వార్డు సభ్యులు మన్నే నాగరాజు, మాజీ సర్పంచి ఆంజనేయరాజు, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు ముక్కు సత్యనారాయణ, అభిరుచి కాశీరాజు, యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజనల్ మేనేజర్ ముత్తే వెంకన్నబాబు, జెఎన్‌టియు రిజిస్ట్రార్ వి.సుబ్బారావు, కొత్తపల్లి బంగార్రాజు, ప్రధానోపాధ్యాయులు కునుకు నాగేశ్వరరావు, వి.అనురాధ, పాలా ఏసుదాసు, సర్పంచి టి.నాగరాజు, కట్టా వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎపిపిగా శివరామకృష్ణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తనను నియమిస్తూ ప్రభుత్వం జిఒ జారీ చేసినట్లు కుసులూరి శివ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనకు ఈ అవకాశాన్ని ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, మంత్రి నారా లోకేష్, గోదావరి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వర్తించి మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు. అడిషనల్ పబ్లిక్ ప్యాసిక్యూటర్‌గా నియమితులైన కుసులూరి శివరామకృష్ణకు తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యుత్ ఉత్పత్తిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులను ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా ఒకేషనల్ ట్రెయినర్ పి.సత్యశ్రీ లంకలకోడేరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాము, యుఎస్ఎన్.మూర్తి పర్యవేక్షణలో సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తి జరిగే విధానం, విద్యుత్ స్టేషన్ ఏ విధంగా పనిచేస్తుంది, మనకు ఎలా ఉపయోగపడుతుందనే విషయాలను అసిస్టెంట్ ఇంజినీర్ వై.నారాయణరావు, కె.శివ విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు రాము మాట్లాడుడారు.

తోటివారి పట్ల సోదరభావం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ఉండి

సమాజంలో అంటరానితనాన్ని నిర్మూలించి తోటివారిపట్ల సోదర భావం కలిగి ఉండాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కోలమూరు గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న కార్తీక్ మాట్లాడుతూ దళితుల పట్ల వివక్ష చూపకుండా ప్రతి ఒక్కరినీ తమతో చూడాలన్నారు. స్వేచ్ఛ, సమానత్వం రాజ్యాంగం అందరికీ కల్పించిన హక్కు అని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి నడింపల్లి రాంబాబు రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జమాల్, గ్రామ రెవెన్యూ అధికారి అప్పలాచార్యులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనొద్దు

ప్రజాశక్తి - ఉండి

గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా గ్రామంలో వెలిసిన అనధికార లేఅవుట్‌లలో స్థలాలను కొనుగోలు చేసి ఇబ్బందులకు గురికావొద్దని ఉండి గ్రామ పంచాయతీ కార్యదర్శి సిహెచ్ అనిల్ హెచ్చరిక బోర్డును లేఅవుట్లో పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడవ రేవులో ఉన్న అక్రమ లేఅవుట్‌లో ఎవరైనా ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకోవాలన్నా పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులూ లభించవని తెలిపారు. కరెంటు సౌకర్యం కూడా లభించదని, కొనుగోలుదారులు పంచాయతీ అప్రూవల్ లేని లేఅవుట్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి ఇబ్బందులకు గురికావొద్దని సూచించారు. అదేవిధంగా లేఅవుట్ యజమాని అన్ని అనుమతులూ పొందిన తర్వాత మాత్రమే ఇళ్ల స్థలాలు అమ్మాలన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో సదుపాయాలు సమకూర్చేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఎస్‌వి.రంగారావు, ఉపాధ్యక్షులు వి.నాగరాజు, సెక్రటరీ కె.భాగ్య శ్రీనాథ్, జాయింట్ సెక్రటరీ, ఎస్.గంగాభవాని పాల్గొన్నారు.

సీతారామలింగేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ట

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ప్రభుత్వాసుపత్రి రోడ్డులోని సీతారామలింగేశ్వరస్వామి దేవాలయ పున్నప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఆలయ ఇఒ రుద్రరాజు ఫణిరామ కిషోర్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వేద పండితులచే పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, రామకృష్ణ, కె.సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెగ్గిపూడి గ్రామానికి చెందిన ప్రముఖులు పమ్మి శ్రీరాములు జ్ఞాపకార్థం ఆయన తనయుడు పమ్మి రాజు ఆర్థిక సాయంతో స్థానిక క్రిస్టియన్ హాస్టల్‌కు వంట సామగ్రిని అందజేశారు. సంస్థ అధ్యక్షులు, జాతీయ, అంతర్జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి మురళీశ్రీనివాస్ రెడ్డి ద్వారా క్రిస్టియన్ హాస్టల్ సంరక్షకుడు బాబురావుకు అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీరాములు జ్ఞాపకార్థం తనయుడు రాజు సహకారం అందించడం అభినందనీయమన్నారు. హాస్టల్ వార్డెన్ బాబూరావు మాట్లాడుతూ మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ద్వారా తమకు సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పాస్టర్ గిరిబాబు, పమ్మి చంద్రరావు, పెదపాటి సురేష్ బాబు, పమ్మి నగేష్, మోషే హాస్టల్ పిల్లలకు కంచాలు, తిను బండారాలు పంపిణీ చేశారు.

దాళ్వాకు వంతుల వారీగా సాగునీరు

ప్రజాశక్తి - వీరవాసరం

జిఅండ్‌వి కాలువ పరిధిలో ఉన్న వీరవాసరం మండలం ఆయకట్టుకు దాళ్వా నిమిత్తం వంతుల వారీగా సాగునీరు అందించనున్నట్టు ఇరిగేషన్ ఎఇ సత్యనారాయణ శుక్రవారం షెడ్యూల్ ప్రకటించారు. వీరవాసరం, బిజిపాలెం, తోలేరు, పెర్కిపాలెం, వడ్డిగూడెం, బాలేపల్లి, బొబ్బనపల్లి, మెంటేపూడి, మత్స్యపురి గ్రామాల ఆయకట్టుకు ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీ వరకూ, 14 నుంచి 20వ తేదీ వరకూ, 27 నుంచి మార్చి 5వ తేదీ వరకూ మార్చి 12 నుంచి 18వ తేదీ వరకూ, మార్చి 25వ తేదీ నుండి 31వ తేదీ వరకూ ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకూ సాగునీరు సరఫరా అవుతుందన్నారు. అలాగే నేలపోగుల, మడుగుపోలవరం, రాయకుదు, నడపనవారపాలెం, ఉత్తరపాలెం, కొణితివాడ, పంజావేమవరం, తోకలపూడి, నవుదూరు, అండలకూరు గ్రామాల ఆయకట్టుకు ఈనెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ, 20 నుంచి 26వ తేదీ వరకూ, మార్చి 5 నుండి 11వ తేదీ వరకూ, 31 నుండి ఏప్రిల్ 6వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ సాగునీరు సరఫరా అవుతుందన్నారు. అందుకు అనుగుణంగా రైతులు తమ సాగును సిద్ధం చేసుకోవాలన్నారు.

అబద్ధాలు చెప్పి కూటమి అధికారంలోకొచ్చింది

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చింది కూటమి ప్రభుత్వమని, అబద్ధాలు చెప్పలేక ఓడిపోయింది వైసిపి అని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం వైసిపి క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిగ్రీ చదివే 9 లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ఏడిపిస్తోందన్నారు. రేపటి భవిష్యత్ విద్యార్థులదని, వారికి ప్రోత్సాహం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 5న రాష్ట్రవ్యాప్తంగా వైసిపి తరపున నిరసన చేపట్టనున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, గోరుముద్ద, సంపూర్ణ పోషణ వంటి పథకాలు కొనసాగిస్తామని పక్కన పెట్టేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. సూపర్ 6 పేరుతో ప్రజలను ఏవిధంగా మోసం చేశారో ప్రజలకు అర్థమవుతోందన్నారు. తాడేపల్లిగూడెంను ఒక పేకాట హబ్‌గా మార్చేశారని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై లోకాయుక్త విచారణ

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని ఏలూరుపాడు గ్రామ పంచాయతీలో భీమవరం డివిజనల్ పంచాయతీ అధికారి చీకట్ల బాలాజీ శుక్రవారం లోకాయుక్త విచారణ నిర్వహించారు. ఏలూరుపాడులో చెరువుకు ఉన్న ఫెన్సింగ్ తొలగించారని, చెరువు మట్టి అమ్మేసుకున్నారని, జగనన్నకాలనీలో మట్టి 4 అడుగుల మేర తీసివేశారని, ఆ పక్కనే ఉన్న చెరువులో అక్రమంగా బోర్ వేశారని, మెయిన్ రోడ్ పక్క ఇరిగేషన్ డ్రెయిన్‌లో డబ్బులు తీసుకుని తూరలు ఉంచేశారని ఇందుకు సర్పంచి, ఎంపిటిసి, డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, విఆర్‌ఒ, సెక్రటరీలు బాధ్యులని లోకాయుక్తాలో ఎన్.నాగార్జున ఫిర్యాదు చేశారు. నోటీసులు జారీచేసి విచారణ చేశారు. అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నివేదికను డిపిఒకు అందజేస్తామని డిఎల్‌పిఒ బాలాజీ తెలిపారు.

'మీడియాలో వస్తేనే సమస్యలు పరిష్కరిస్తారా'

ప్రజాశక్తి - ఆకివీడు

సమస్యలు మీడియాలో వస్తేనే పరిష్కరిస్తారా లేకపోతే పరిష్కరించరా అంటూ వైసిపి కౌన్సిలర్ నిమ్మల నాగేశ్వరరావు అధికారులను ప్రశ్నించారు. ఆకివీడు నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం శుక్రవారం ఛైర్ పర్సన్ జామీ హైమావతి అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభంలో కమిషనర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆర్థిక అంశాలు ప్రస్తావించొద్దని, అజెండాలో కూడా ఏ విధమైన ఆమోదాలు చేర్చలేదని సూచించారు. బడ్జెట్ ఆదాయ వ్యయాలను తెలియజేయడానికి మాత్రమే పొందుపర్చామన్నారు. ఈ మేరకు నాగేశ్వరావు మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద పెరిగిపోయిందని, ఎంతోమంది ఆసుపత్రి పాలవుతున్నారని తెలిపారు. కుక్కలకు కు.ని ఆపరేషన్లు ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. ఫాగింగ్ మిషన్లు పక్కకు పడేశారని, వాటిని ఉపయోగించాలని కోరారు. వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలో కుళాయి ఆన్‌లైన్ చేస్తే నాలుగు కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని వెంటనే వాటిని ఆన్‌లైన్ చేయాలన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో దోమలను అరికడదాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజల భాగస్వామ్యంతో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం కడకట్ల పట్టణ పిహెచ్‌సి పరిధిలోని 34, 35వ వార్డుల్లో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్ అండ్ ఫ్రైడే ఫ్రైడే వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రాజేశ్వరీ, జ్యోతి, ఆశా కార్యకర్తలు స్వాతి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉండి : లార్వా దశలోనే దోమలను నియంత్రించాలని ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది తెలిపారు. మండల వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో శానిటేషన్ చేయించి ప్రజలకు దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు చేరి గుడ్లు పెడతాయని, వాటి వలన దోమల వ్యాప్తి ఎక్కువ అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమతెరను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాత్రికేయులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పాత్రికేయులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని ఎపిడబ్ల్యూజె ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రంగా సురేష్ పేర్కొన్నారు. ప్రముఖ పాత్రికేయుడు, సుప్రసిద్ధ సంఘసేవకుడు యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి 14వ వర్ధంతి తాడేపల్లిగూడెం జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్, ప్రెస్ క్లబ్, ఎపియుడబ్ల్యూజె జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తమ్మిసెట్టి రంగసురేష్ అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి స్మారక జిల్లాస్థాయి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డును 2024కి గాను తాడేపల్లిగూడెం ఆంధ్రజ్యోతి విలేకరి మైలవరపు రవికిరణ్‌కు అందచేశారు. 5,116 రూపాయల నగదు, నూతన వస్త్రాలు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో గరికపాటి బాపయ్య శర్మ, పాత్రికేయులు, యద్దనపూడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **TADIPARTHI DURGA BHAVANI,** W/o Siva Gangadhara Rao, resident of Door.No. 14-83, Velgavaripalem, Penumantra, Penumantra Mandal, West Godavari District. A.P., India.

I have changed my name from **TADIPARTI DURGA** (Old Name) to **TADIPARTHI DURGA BHAVANI** (New Name). Hence after all my documents, Passport ete., will continue with my new Name **TADIPARTHI DURGA BHAVANI**

దస్తావేజు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం గ్రామీణ మండలం, తూర్పు తాళ్ళు గ్రామానికి చెందిన అడ్డాల వరలక్ష్మి W/o సూర్యనారాయణ అను నేను తూర్పు తాళ్ళు గ్రామంలో ఉన్న **30 సెంట్లు భూమి దస్తావేజు నెంబర్ 5/2000** జనవరి 3, **ఆర్ ఎస్ నెంబర్ 122-3** గల **ఒరిజినల్ డాక్యుమెంట్స్** తో నా కుమారుడు తో ద్విచక్ర వాహనంపై మొగల్తూరు వెళుతూ ఉండగా మార్గమధ్యంలో జారి పడిపోయినవి. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

అడ్డాల వరలక్ష్మి
W/o: సూర్యనారాయణ
తూర్పు తాళ్ళు 534280
నరసాపురం
సెల్: 9912449305

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No. 9/2020 in O.S.No. 99/2013

Between:

యాగాటి రామకృష్ణ ...పిటీషనరు/డిక్రీహోల్డర్

And

లంకె శ్రీనివాసరావు ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డేబ్టర్

To:

Respondent/J.D.R:-

Lanke Srinivasa Rao,
S/o. Satyanarayana,
Maruthi Readymade cloth Showroom
Main Road, Narasapuram,
Narasapuram Mandal, W.G.Dt.,

పై నెంబరు పిటిషనులో రెస్పాండెంటు/జడ్జిమెంట్ డేబ్టర్ హాజరు నిమిత్తం **ది.04-02-2025వ తేదీకి** వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం. 10-30 ని.లకు** స్వయంగా కానీ, న్యాయవాది గారి ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పిటిషను ముందు గ్రంధము జరుపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

శ్రీ మేడపాటి వెంకట రామారెడ్డి
నరసాపురం — న్యాయవాది
ది.30-1-2025 — పాలకొల్లు, ప॥గో॥జిల్లా

దస్తావేజులు పోయినవి

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు కొల్లి సూర్యరావు గారి కుమారుడు కొల్లి మూర్తి గారు తేతలి గ్రామంలో గల డాక్యుమెంట్ నెంబరు 2042/2007 విక్రయ దస్తావేజు పొంది ఉన్నారు. సదరు ఆస్థిని గృహ రుణం కోసం వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తణుకు బ్రాంచ్ నందు రుణం తీసుకొనుచున్నారు. సదరు ఆస్తికి సంబంధించిన **లింకు దస్తావేజు ఒరిజినల్ రిజిష్టర్ దస్తావేజు నెం. 2042/2007 (16/04/2007)** ఈ రిజిష్టర్ కాబడిన డాక్యుమెంట్‌కు **లింకు డాక్యుమెంట్ గా ఉన్న 359/2002 లింకు దస్తావేజులు** తేతలి గ్రామం నుండి తణుకు వస్తుండగా దారిలో పడిపోవడం జరిగింది. వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తణుకు బ్రాంచ్ నుండి నా క్లయింటు రుణాన్ని వినియోగించుకుంటున్నారు. ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోయిన దృష్యా ప్రత్యామ్నాయంగా విక్రయ **దస్తావేజు నెం. 2042/2007 (16/04/2007)** దీనికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ **359/2002** యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్స్ లో పాటు డిపాజిట్ చేస్తున్నారు. కావున ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్ కనుగొన్న లేదా దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలిపిన నా క్లయింటు చిరునామాకు వాపసు చేయగలరు. ఇంతకు తెలియజేయునది ఏమనగా ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు ఎవరైనా వీటిని వినియోగించిన ఎడల చట్టవిరుద్ధమగును. మరియు వారిపై అవసరమైన చట్టరిత్యా చర్యలు తీసుకోబడును.

సం ఎ. నాగేశ్వరరావు
తణుకు — నోటరీ అడ్వకేట్. తణుకు
29-01-2025 — సెల్: 99890 72647

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) భీమవరం వారి కోర్టులో

E.P.No. 26/2023 in O.S.No. 835/2005

DHR/Peitioner... చుక్క లక్ష్మి నరసమ్మ
J.Dr /Respondent... ఇళ్ల నాగేశ్వరరావు వగైరాలు
ఐదవ JDR/ రెస్పాండెంట్: జక్కంశెట్టి సీత, W/o రవి, ఆగర్రు గ్రామం, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు గ్రంధంలో ఐదవ JDR/ రెస్పాండెంట్ అయిన జక్కంశెట్టి సీత, W/o రవి, ఆగర్రు గ్రామం, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను ఆర్డర్ 21 రూల్ 35 నోటీసులు పంపినను తీసుకొనక అందుకోక కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటన అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం **ది.10-02-2025 వ తేదీకి** వాయిదా అయి వున్నది. కావున ఐదవ JDR/ రెస్పాండెంట్ అయిన జక్కంశెట్టి సీత మీరు **ది.10-02-2025వ తేదీ ఉదయం గం. 10-30 ని.లకు** మీ అభ్యంతరములు స్వయంగా గానీ, మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియ చేసుకొనవలెను. లేని యడల సదరు పై నెంబరు గ్రంధమును మీ పరోక్షమున తీర్మానించబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

పంపన రవి కుమార్
B.A.,B.L.
భీమవరం — DHr తరపు అడ్వకేట్
ది. 30-01-2025 — భీమవరం

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No. 3/2021 in OS. No. 82/2015

ముంగండి శ్రీరాజరాజేశ్వరి ...DHR

Vs

1. దొమ్మేటి ధనలక్ష్మి (**Dide**)
2. దొమ్మేటి సాంబమూర్తి ...**JDRS**

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం సబ్-రిజిస్ట్రారు నరసాపురం మండలం, రుస్తుంబాద, నరసాపురం మున్సిపల్ 26వ వార్డు.

1. జిరాయితీ మెరక RS no.483/11 Door No. 16-1-20/1 గల పెంకుటిల్లు స్థలం య.0-04 సెంట్లు సమానమైన 194.చ॥గ స్థలమునకు హద్దులు.

తూర్పు : చెల్లుబోయిన వెంకన్నగారి స్థలం 67 లింకులు
దక్షిణము : 2వ ప్రతి స్థలం 64 లింకులు
పడమర : చెల్లుబోయిన వెంకటేశ్వర్లు యిల్లు స్థలం 65 లింకులు
ఉత్తరం : కొత్తపల్లి భుజంగరాయుడు స్థలం 58 లింకులు

2వ ఐటమ్ య.0-00 1/2 సెంట్లు కు సమానమైన 24.చ॥గ స్థలమునకు హద్దులు.

తూర్పు : చెల్లుబోయిన వెంకన్నగారి స్థలం 98 లింకులు
దక్షిణము : చెల్లుబోయిన సత్యనారాయణగారి స్థలం 7 లింకులు
పడమర : జాయింట్ దారి మార్గం 98 లింకులు
ఉత్తరం : పై 1వ ప్రతి యిల్లు వెరసి రెండో ప్రతులు 218 చ॥గలు స్థలం యందలి పెంకుటిల్లు సహా

షెడ్యూలు దాఖలా ఆస్తిని DHR యొక్క బాకీ వసూలు నిమిత్తం పై కోర్టు వారి **ది. 20-2-2025వ తేదీన ఉ.గం. 10-30 ని.లకు** లగాయతు కోర్టులో వేలంలో విక్రయించబడును. కాబట్టి సదరు వేలంలో పాడుకొనుటకు కోర్టు వారు యీ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయుచున్నారు. యిందుమూలముగా యావన్మంది వేలములో పాల్గొనగలందులకు కోరడమైనది.

DHR వేల్యు Rs. 5,00,000/-
అమీనా వేల్యు Rs. 11,25,000/-

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

శ్రీ గునిశెట్టి శ్రీనివాసరావు
నరసాపురం — DHR తరపు అడ్వకేటు
ది.31-1-2025 — నరసాపురం
సెల్: 95531 26234